


## ఎర్రోళ్ళ శ్రీనివాస్‌ను కలిసిన బిఆర్ఎస్ నేతలు

**మర్కుక్, మే 5 (ప్రభాతవార్త):** తెలంగాణ రాష్ట్ర వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ చైర్మన్ డాక్టర్ ఎర్రోళ్ళ శ్రీనివాస్ జన్మదినం సందర్భంగా శుక్రవారం బిఆర్ఎస్ మర్కుక్ మండల పార్టీ అధ్యక్షుడు మర్కు క్ కరుణాకర్‌రెడ్డి, మండల బిసిసెల్ అధ్యక్షుడు మేకల కనకయ్యాము దిరాజ్, మర్కుక్ సర్పంచ్ భాస్కర్, మర్కుక్ గ్రామ అధ్యక్షుడు అజయ్‌రెడ్డి, పాములపర్తి యూత్ అధ్య క్షుడు బోయిని మురళీకృష్ణ, నాయకులు శ్రీనివా స్‌రెడ్డి, మల్లేశ్, మహేష్‌లు హైద్రాబాద్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.


శ్రీనివాస్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నేతలు

## 15 నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు : ఎంపిడిఓ

**కంగ్టి, మే 5, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన కంగ్టిలో ఈ నెల 15వ తారీఖు నుంచి 17వ తేదీ వరకు మండల స్థాయి క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు ఎంపిడిఓ ముజాఫరోద్దిన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 15 సంవత్సరాల నుంచి 36 సంవత్సరాల వయసులోపు క్రీడాకారులు (పురుషులు, స్త్రీలు) పోటీల్లో పాల్గొనవచ్చున్నారు. అథ్లెటిక్స్, కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్ (పురుషులు, స్త్రీలు), ఫుట్ బాల్ క్రీడలు మూడు రోజుల పాటు కొనసాగనున్నట్లు పేర్కొన్నారు. మండల కేంద్రమైన కంగ్టిలోని తెలంగాణ క్రీడా ప్రాంగణంలో కొనసాగే మండల స్థాయి పోటీల కమిటికి చైర్మన్‌గా ఎంపిపి అధ్యక్షులు, జడ్పీటిసి సభ్యులు, ఎంపిడిఓ, కన్వీనర్‌గా తహసీల్దార్, ఎంఈఓ, ప్రధానోపాధ్యాయులు, ఎస్ఐ, పీఈటీల ఆధ్వర్యంలో పోటీలు కొనసాగుతాయన్నారు. క్రీడాపోటీల్లో పాల్గొనే క్రీడాకారులు, తమ పేర్లను, తమ టీం పేర్లను ఈ నెల 6వ తేదీ నుంచి 12వ తేదీ వరకు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని సూచించారు. క్రీడాకారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఓ వివరించారు.


బిజెపి శ్రేణులను అరెస్టు చేస్తున్న పోలీసులు

## భజరంగ్ దళ్‌ను నిషేధిస్తామని కాంగ్రెస్ ప్రకటించడం సిగ్గుచేటు

### బిజెపి జిల్లా అధ్యక్షులు దూది శ్రీకాంత్‌రెడ్డి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**
భజరంగ్ దళ్‌ను నిషేధిస్తామనిఇ కాంగ్రెస్ పార్టీ ప్రకటించడం సిగ్గ చేటని బిజెపి జిల్లా అధ్యక్షులు దూది శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. కర్ణాటక ఎన్నికల మానిఫోస్టోలో భజరంగ్ దళ్‌ను నిషేధిస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించడాన్ని నిరసిస్తూ పార్టీ పిలుపు మేరకు శుక్రవారం సిద్దిపేటలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ముందు నిరసన తెలుపడానికి పార్టీ శ్రేణులతో కలిసి వెళ్లగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పార్టీ శ్రేణులు రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు. హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. జైశ్రీరాం..రాం లక్ష్మన్ జానకీ జైబో లో హనుమాన్ అంటూ నినాదించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కర్ణాటక కాంగ్రెస్ మేనిఫెస్టోలో భజరంగ్ దళ్‌పై నిషేధం విధిస్తామని ప్రకటించడాని వెంటనే తొలిగించాలన్నారు. భజరంగ్ దళ్‌ను నిషేధిస్తామన్న కాంగ్రెస్ హనుమంతుడి బ్యాన్ చేస్తామని అంటారని మండిపడ్డారు. పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్క హిందువు కాంగ్రెస్ వ్యాఖ్యాలను ఖండించాలన్నారు. కాంగ్రెస్‌కు కర్ణాటక ఎన్నికల్లో గుణపాఠం తప్పదనానరు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్రీనివాస్ యాదవ్, ఉపేందర్‌రావు, నరేష్, శివకుమార్, కొత్తపల్లి వేణుగోపాల్, గోనె మార్కండేయులు, సత్యనారాయణ, శ్రీనివాస్, యాదన్‌రావు, కనకరాజు, ఉమాపతి, శ్రీనివాస్, వెంకట్, పద్మ, ఇంద్రాణి తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధిలో గజ్వేల్ అగ్రగామి

-రూ.23 కోట్లతో జరుగుతున్న సిసి రోడ్ల పనులు

-తుది దశకు చేరుకున్న రింగ్‌రోడ్డు పనులు

-మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి


అన్నదానం చేస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజమౌళి

**గజ్వేల్, మే 5 (ప్రభాతవార్త):**
గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ సిఎం కెసిఆర్, మంత్రి హరీష్‌రావుల సహకారంతో అభివృద్ధిలో అగ్రగామిగా నిలిచిందని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి పేర్కొన్నారు. శుక్రవారం గజ్వేల్ పట్టణంలో ఇంటర్నేషనల్ ఆర్యవైశ్య తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ టూరిజం కార్పోరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త పుట్టినరోజు సందర్భంగా ఇందిరా పార్కు చౌరస్తా వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్‌లో అభివృద్ధి కుంటుపడుతుందని ప్రచారం చేయడం సరైందికాదన్నారు. సిఎం కెసిఆర్, మంత్రి హరీష్‌రావుల సహకారంతో 24 కోట్ల రూపాయలతో సిసి రోడ్ల పనులు జరుగుతున్నాయని, మున్సిపాలిటీ చుట్టూ 23 కిలోమీటర్ల రింగ్‌రోడ్డు నిర్మాణం తుది దశకు చేరుకుందన్నారు. రెండుమూడు రోజుల్లో కోటమైసమ్మ రోడ్డు పనులు చేపట్టేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇందిరాపార్కు చౌరస్తా నుండి కోటమైసమ్మ ఆలయం వరకు వంద ఫీట్ల రోడ్డు నిర్మాణం కొరకు ఇరువైపులా ఇళ్ళను కూల్చివేయడం జరిగిందన్నారు. అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్, ఇందిరాపార్కు చౌరస్తా సుందరీకరణ చేసినట్లు తెలిపారు. సంగుపల్లి, సంగాపూర్ రోడ్లలో డివైడర్ లైటింగ్ ఏర్పాటు చేశామన్నారు. గడిచిన ఎనిమిదేళ్ళలో కనీవినీ ఎరుగని రీతిలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ అభివృద్ధి చెందిందని, గజ్వేల్‌లో సమీకృత మార్కెట్, ఎడ్యుకేషన్‌హబ్, మహతి ఆడిటోరియం, మున్సిపల్ కార్యాలయం, జిల్లా ప్రభుత్వాసు పత్రి, అర్బన్ పార్కు ఇలా ఎన్నో ఉన్నాయని అన్నారు. ప్రతిపక్ష నేతలు అభివృద్ధి కనిపించడంలేదని అనడం సమంజసం కాదన్నారు. సిఎం కెసిఆర్, మంత్రి హరీష్‌రావుల సహకారంతో మున్సిపల్‌ను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామ న్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు నం గునూరి సత్యనారాయణ, గోలి సంతోష్, సంపత్, సిద్ది బిక్షపతి, తోట బిక్షపతి, కైలాస ప్రభాకర్, గోపిశెట్టి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## ఆవాలతో బుద్ధుడి చిత్రం

**గజ్వేల్, మే 5 (ప్రభాతవార్త):**
రామకోటి భక్త సమాజం ఆధ్వర్యంలో బుద్ద పౌర్ణమిని పురస్కరించుకొని బుద్ధుని చిత్రాన్ని ఆవాలతో అద్భుతంగా చిత్రించి శుక్రవారం రామకోటి కార్యాల యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గజ్వేల్ పట్టణానికి చెందిన కళారత్న రాష్ట్ర స్థాయి అవార్డు గ్రహీత రామ కోటి రామ రాజు మాట్లాడుతూ ఎన్నో చిత్రాలను ఎన్నో రకాలుగా చిత్రించాన న్నారు. బుద్ధుని బోధనలు మనమందరం తప్పక తెలుసుకొని ఆయన


ఆవాలతో చిత్రించిన బుద్ధుని చిత్రంతో రామరాజు

ఆడుగుజాడల్లో నడవాలని అన్నారు.


ఇండోర్ స్టేడియంను ప్రారంభిస్తున్న మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే సతీష్‌కుమార్

## అంజన్న గుడి లేని ఊరు.. కేసీఆర్ పథకం రాని ఇళ్లు లేదు

### రాష్ట్ర ఐటి, మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్

**హుస్నాబాద్, మే5, ప్రభాతవార్త :**
అంజన్న గుడి లేని ఊరు.. కేసీఆర్ పథకం రాని ఇళ్ల రాష్ట్రంలో లేవని రాష్ట్ర ఐటి, మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్ వ్యాఖ్యానించారు. శుక్రవారం రోజున హుస్నాబాద్ పట్టణంలో పలు అభివృద్ధి ప్రారంభోత్సవాల కార్యక్రమానికి హాజరైన ఆయన పట్టణంలోని డిపో గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ప్రజా ఆశీర్వాద సభకు ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హుస్నాబాద్‌కు మొదటి సారి వచ్చిన మంత్రి కేటీఆర్‌కు ఎమ్మెల్యే సతీష్‌కుమార్ పుష్పగుచ్ఛం అందజేసి సాధారంగా ఆహ్వానించారు. హుస్నాబాద్ ప్రాంత ప్రజల కోరిక మేరకు కొత్తపల్లి టూ జనగాం రహదారి ప్రతిపాధనను ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి రహదారిని రాష్ట్రీయ రహదారిగా రూపొందిస్తామన్నారు. ఈనేపధ్యంలో ఏర్పాటు చేసిన సభకు ఎమ్మెల్యే సతీష్‌కుమార్ సభాధ్యక్షత వహించి పట్టణంలోని పలు అభివృద్ధి పనుల విషయంలో పలు సమస్యలను వాటికయ్యే నిధుల విషయంలో మంత్రికి ఏకరువు పెట్టారు. ఈ విషయంపై మంత్రి స్పందిస్తూ ఎమ్మెల్యే సతీష్‌కుమార్ సౌమ్యుడని అంటారని కానీ అతనిలో సాఫ్ట్‌తో పాటు ఆయన మనసులో హార్డ్‌వేర్ కూడా ఉందని చమత్కరించారు. తాను అడగిన ఏపనినైనా రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రులు ఎవరైనా కాదని అంటూ ఇదే వేదికపై హుస్నాబాద్ అభివృద్ధి పనులకై మరో 25కోట్లు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. చీమకు కూడా హాని తలపెట్టని ఎమ్మెల్యే సతీష్‌కుమార్‌తో పాటు ఈ ప్రాంత అభివృద్ధికి ఆహర్నిశలు కృషి చేసే మాజీ ఎంపి, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయిన్‌పల్లి వినోద్‌కుమార్‌లను రానున్న ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని పిలుపునిస్తూ ప్రజలు ఈ మారు రాబోయే ఎన్నికల వరకు మొట్టప్రాంత రైతాంగం కోసం గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేస్తూ 1లక్ష ఆరు వేల ఎకరాలకు సాగునీరు అందింబోతున్న నేపధ్యంలో ఇందుకు అనుగుణంగా ఎమ్మెల్యే సతీష్‌కుమార్‌కు లక్ష ఓట్లపైగా మెజారిటీ అందించి మూడవ సారి ముచ్చటగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

హుస్నాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటి వరకు కళ్యాణ లక్ష్మి, షాదీముభారక్ పథకాల ద్వార పేదింటి ఆడబిడ్డలకు 11వేల మందికి 1లక్ష 16రూపాలయ చొప్పున అందజేశామని గుర్తు చేశారు. ఎమ్మెల్యే సతీష్‌కుమార్ నాయకత్వంలో అభివృద్ధికి నోచుకోని హుస్నాబాద్ అభివృద్ధికి కేరాఫ్‌గా మారుతోందన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న గిరిజన తండాలు సైతం అభివృద్ధి చెందాలనే సంకల్పంతో 11 తండాలను గ్రామ పంచాయతీలుగా తీర్చిదిద్దారన్నారు. ప్రజా ఆశీర్వాద సభకు ముందుగా 1కోటి రూపాయలతో నిర్మించిన ఇండోర్ స్టేడియం, 2కోట్ల 25లక్షలతో నిర్మించిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల, 1కోటి రూపాయలతో నిర్మించిన ఎస్టి ఉమెన్స్ హాస్టల్, 16కోట్ల 46 లక్షలతో నిర్మించిన డబుల్‌బెడ్‌రూంలు, 2కోట్లతో నిర్మించిన టిటిసి సెంటర్, 10లక్షలతో ఏర్పాటు చేసిన బస్తీ దావాఖానా 1కోటి 2లక్షలతో నిర్మించిన మున్సిపల్ షాపింగ్ కాంప్లేక్స్ ప్రారంభోత్సవాలతో పాటు 3కోట్ల 50లక్షలతో ఎల్లమ్మ చెరువు సుందరీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీష్‌కుమార్, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయిన్‌పల్లి వినోద్‌కుమార్, ఎమ్ఎల్‌సిలు ఎల్ రమణ, సుధాకర్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్ర శ్రీహర్, జడ్పి వైస్ చైర్మెన్ రాయిరెడ్డి రాజారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత వెంకన్న, వైస్ చైర్మెన్ అయిలేని అనితశ్రీనివాస్‌రెడ్డి, ఎంపిపి లకావత్ మానససుభాష్, కొక్కుల కీర్తి, జడ్పిటిసిలు భూక్య మంగశ్రీనివాస్‌తో హుస్నాబాద్ కౌన్సిలర్లు, ఆ పార్టీ మండల అధ్యక్షుడు తదితరులు పాల్గొన్నారు.

## పట్టుదల ఉంటే ఏదైనా సాధించొచ్చు

### మంత్రి తన్నీరు హరీష్‌రావు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**
అమ్మ, నాన్నలు పిల్లల నుంచి ఆశించేది ప్రేమ మాత్రమేనని.. సమాజంలో గొప్ప వ్యక్తిగా గుర్తించబడితే తల్లిదండ్రులు ఎంతో సంతోషిస్తారని.. జన్మనిచ్చిన తల్లిదండ్రుల రుణం తీర్చుకోవాలంటే వారి అశయాలు నెరవేర్చాలని రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు విద్యార్థులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని వీఎఆర్ గార్డెన్‌లో ప్రతిభ డిగ్రీ, పీజీ కళావాల ప్రిన్సిపాల్ సూర్యప్రకాష్ అధ్వర్యంలో విద్యార్థులచే రూపొందించిన సిద్దిపేట నియోజకవర్గ అభివృద్ధి వీడియోను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఇన్‌స్పైర్, ఇగ్నైట్ సంస్థ ప్రతినిధి రంజిత్ బృందం విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, మోటివేషన్ క్లాస్, పర్సనల్ డెవలఫ్‌మెంట్ స్కిల్స్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులందరిచేత తల్లిదండ్రుల జ్ఞాపకాలు గుర్తుకు వచ్చి కంటితడి వచ్చేలా చేసింది. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి హరీష్‌రావు పాల్గొని మాట్లాడారు. దేవుడి తర్వాత అమ్మ, నాన్న, గురువని, తల్లిదండ్రుల ఆశయాన్ని నిలబెట్టే బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. సమాజంలో ఎంత గొప్పగా ఎదిగితే మీ జీవితంలో తల్లిదండ్రులకు మీరిచ్చే గౌరవం అదే ఉంటుందని.. తల్లిదండ్రులు సమాజంలో తల ఎత్తుకునేలా చేస్తే అదే మనమిచ్చే రుణమన్నారు. తల్లిదండ్రులను వృద్దాశ్రమంలో ఉంచే సంస్కృతి మంచిది కాదన్నారు. భారతీయ సంస్కృతి దేశంలో అత్యంత గొప్పదని.. పాశ్చాత్య దేశాల మోజులో పడొద్దన్నారు. అమ్మ, నాన్నలను మంచి ఎవరూ లేరని సోషల్ మీడియాలలో వచ్చే ఏమోషనల్ వీడియోలు నమ్మి నిజ జీవితంలో మోస పోవద్దన్నారు. పట్టుదల ఉంటే ఏదైనా సాధించొచ్చని.. లక్ష్యాన్ని చేరాలంటే సరైన గోల్ పెట్టుకోవాలన్నారు. సిద్దిపేట నా కుటుంబంగా భావించి దేశంలో ఎక్కడికి వెళ్లినా.. ఏదైనా కొత్త రకం చూసినా నా సిద్దిపేట కుటుంబానికి ఏర్పాటు చేయాలనే అలోచన నాలో ఉంటుందన్నారు. విద్యార్థులు తల్లిదండ్రుల పేరు నిలబెట్టేలా చదివి.. సిద్దిపేట ప్రతిష్టను నిలబెట్టాలని అప్పుడే మీ భవిష్యత్తుకు సార్థకత ఉంటుందన్నారు. సమయం చాలా విలువైనదని సమయాన్ని సద్వినియోగం పర్చుకుంటే మీ జీవితంలో గొప్పవారవుతారని తెలిపారు. సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, రాష్ట్ర నర్సింగ్ కౌన్సిల్ సభ్యులు పాల సాయిరాం, బిఆర్ఎస్‌వి జిల్లా అధ్యక్షులు మెరుగు మహేష్, అర్టీఓ సభ్యులు ఇర్షద్‌హుస్సేన్, కౌన్సిలర్ నాగరాజురెడ్డి, బిఆర్ఎస్ నాయకులు మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి హరీష్‌రావు

## నిరుద్యోగుల జీవితాలతో బిఆర్ఎస్ ప్రభుత్వం ఆటలు

### టిపిసిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు, పార్లమెంట్ ఇంచార్జీ జగదీశ్‌రావు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జగదీశ్‌రావు

**నర్సాపూర్, మే 5.ప్రభాతవార్త:**
రాష్ట్ర బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సిఎం కెసిఆర్ ఆధ్వర్యంలో పేపర్ లీకేజీలకు పాల్పడి నిరుద్యోగ ల జీవితాలతో ఆటలాడుకుంటున్నాడని, పేపర్ లీకేజీలతో నిరుద్యోగ కుటుంబాలు రోడ్డున పడగా ఈ నిరుద్యోగులకు అండగా ఉంటు నిరుద్యోగ వ్యతిరేక విదానాలపై పేపర్ లీకేజీలకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో ఈనెల 8 న ఎల్బీ నగర్‌లోని సరూర్‌నగర్‌లో విద్యార్థి నిరుద్యోగ జంగ్ సైరన్ బహిరంగ సభను నిర్వహిస్తున్నామని ఈ భహిరంగ సభను విజయవంతం చేయాలని టిపిసిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు జగదీశ్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం నర్సాపూర్‌లో కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో నర్సాపూర్ నియోజకవర్గ స్థాయి విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా టిపిసిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు జగదీశ్‌రావు పాల్గొనగా టిపిసిసి ఉపాధ్యక్షులు కైలాష్‌కుమార్, టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూపతిరెడ్డి, టిపిసిసి రాష్ట్ర ప్రదాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి. నర్సారెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు తిరుపతిరెడ్డి, టిపిసిసిప్రతినిదులు ఆంజనేయులుగౌడ్, సోమన్నగారి రవిందర్‌రెడ్డి, సుప్రభాతరావు, బాలకృష్ణలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి కెసిఆర్ 2014 ఎన్నికల్లో తమ పార్టీ అధికారంలోకి వస్తే ఇంటికో ఉద్యోగం ఇస్తానని, కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తానని హామీఇచ్చిమరిచిపోయి ఇంటికో ఉద్యోగం కాదుకదా ఊరికో ఉద్యోగం కూడ ఇవ్వలేదన్నారు. అటుతర్వాత రెండవసారి ఎన్నికల్లో నిరుద్యోగ యువతకు 3016 రూపాయిలు నిరుద్యోగ భృతి ఇస్తానని హామీ ఇచ్చి మరిచిపోయా డన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వ హాయాంలో విద్యార్థుల భవిష్యత్ కోసం పీజు రియంబర్స్‌మెంట్ అమలు చేస్తె ప్రస్తుత ప్రభుత్వం విద్యార్థులను విస్మరించి పీజు రియంబర్స్‌మెంట్ ఇవ్వడం లేదన్నారు. 12 వందల మంది విద్యార్థుల బలిదానాలతో అధికారంలోకి వచ్చిన సిఎం కెసిఆర్ నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించకపోగా పరీక్షల పేపర్లను లీకేజీలు చేస్తు నిరుద్యోగ యువకులతో ప్రభుత్వం చెలగాటమాడుతుందన్నారు. పారదర్శకత లేని అసమర్థత కెసిఆర్ పాలన వైఖిరి వల్ల పేపర్‌లీకేజీలతో అయోమయంలో ఉన్న 45 లక్షల మంది నిరుద్యోగ యువతకు అండగా ఉంటు తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో ఈ నెల 8 న సరూర్‌నగర్‌లో విద్యార్థి నిరుద్యోగ జంగ్ సైరన్ భహిరంగ సభను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ భహిరంగ సభకు ఏఐసిసి జనరల్ సెక్రటరీ ప్రియాంక గాంధీ ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. ఈభహిరంగ సభకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో పాటు విద్యార్థి, నిరుద్యోగులు అధిక సంఖ్యలో తరిలి వచ్చి ఈ భహిరంగ సభను విజయవంతం చేయాలని వారు కోరారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మల్లేషం, పట్టణ అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రిజ్వాన్ నాయకులు గుర్రాల అశోక్, శ్రీశైలంయాదవ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, ఎన్ఎస్‌యుఐ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు ఎంపిటిసీలు, సర్పంచ్‌లు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ మార్చ్‌ను విజయవంతం చేయండి

### బీజేపీ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్

**మెదక్ అర్బన్, మే5 ప్రభాతవార్త:**
ఈ నెల 11వ తేదీన శుక్రవారం ఉమ్మడి మెదక్ జిల్లాలోని సంగారెడ్డి పట్టణంలో నిర్వహించే నిరుద్యోగ మార్చ్‌ను విజయవంతం చేయాలని బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్ గడ్డం శ్రీనివాస్ కోరారు. శుక్రవారం భారతీయ జనతా పార్టీ మెదక్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం బీజేపీ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్ మాట్లాడుతూ నీళ్లు, నిధులు, నియామకాల కోసం సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం నేడు కల్వకుంట్ల కుటుంబంలో బందీ అయిందన్నారు. తెలంగాణ ప్రజలను మోసం చేస్తూ నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించలేక బీఆర్ఎస్ ప్రభుత్వం శాంపంగా మారిందన్నారు. టీఎస్ పీఎస్సీ పేపర్ల లీకేజీ వ్యవహారంలో ప్రభుత్వ పెద్దల హస్తం ఉందని, ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న ప్రతి ఒక్కరిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు భరోసా కల్పించడానికి, వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి బీజేపీ తెలంగాణలోని 10 ఉమ్మడి జిల్లాల్లో నిరుద్యోగ మార్చ్‌ను నిర్వహించడం జరుగుతుందన్నారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ల లీకేజీ వ్యవహారాన్ని సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌ను బర్తరఫ్ చేయాలన్నారు. 33 లక్షల మంది నిరుద్యోగులకు లక్ష రూపాయల చొప్పున చెల్లించాలన్నారు. మెదక్ ఉమ్మడి జిల్లాలోని సంగారెడ్డి పట్టణంలో ఈ నెల 11వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు నిరుద్యోగ మార్చ్ నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ నిరుద్యోగ మార్చ్‌ను మెదక్, సంగారెడ్డి, సిద్ధిపేట మూడు జిల్లాల్లోని నిరుద్యోగులు, యువకులు, మేధావులు పాల్గని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నందు జనార్ధన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లాల విజయ్, రాష్ట్ర నాయకులు తాళ్లపల్లి రాజశేఖర్, ఎక్కలదేవి మధు, కన్వీనర్ బైండ్ల సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు, మోర్చల అధ్యక్షులు బెండె వీణ, మల్లారెడ్డి, మండల అధ్యక్షులు నాయిని ప్రసాద్, ప్రభాకర్, సంతోష్ చారి, రంజిత్‌రెడ్డి, చంద్రశేఖర్, కార్యకర్తలు, యువ మోర్చా నాయకులు తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్

## ద్రవించిన కన్న హృదయం

### చితిపేర్చుకుని మంటల్లో అగ్నికి ఆహుతైన తండ్రి

**హుస్నాబాద్‌రూరల్, మే5, ప్రభాతవార్త**
తనకు తోడునీడగా నిలిచిన సహధర్మచారిణి కాలం చేయడంతో తాను కన్న ఆ నలుగురు సంతానం తనను ఆస్తులు పంచుకున్నట్లుగా వంతుల వారితీగా పంచుకున్న తీరుతో అతని కన్న హృదయం చలించింది. 'ఛీ' ఈ బతుకు అనుకుని చావాలని నిర్ణయించుకున్నాడు. ఈ సంఘటన సిద్దిపేట జిల్లాలోని హుస్నాబాద్ మండలం పొట్లపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గురువారం నాడు జరిగిన ఈసంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల ప్రకారం పొట్లపల్లి గ్రామానికి చెందిన మెదబోయిన వెంకటయ్య(90)కు నలుగురు కుమారులతో పాటు ఒక కూతరు జన్మించింది. నలుగురిలో కనకయ్య, ఉమ్మయ్య, పోచయ్య, ఆగయ్యతో పాటు ఒక సోదరి ఉంది. అయితే వెంకటయ్య పోషణ విషయంపై అక్కడి పెద్దమనుషుల సమక్షంలో ఒక తీర్మాణం చేసుకున్నట్లు సమాచారం. ఇందుకు అనుగుణంగా గత ఐదు మాసాల క్రితం జరిగిన ఈ ఒప్పందంతో మనసు చివుక్కుమన్న వెంకటయ్య దాంతో పాటు ఈ గ్రామంలోనే నివాసముంటున్న పెద్దకుమారుడు కనకయ్య పోషణ వంతు ముగియండతో రెండవ కుమారుడైన ఉమ్మయ్య నివాస ముంటున్న కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం నవాబుపేట గ్రామానికి వెళ్ళాల్సిన వెంకటయ్య అక్కడికి వెళ్ళడం ఇష్టంలేక తాను ఇక్కడే ఉంటానని చెప్పారు. మనస్థాపానికి గురై కుమిలిపోయిన వెంకట య్య మంగళవారం సాయంత్రం ఇంటినుండి వెళ్ళి గ్రామంలోని ఒక ప్రజా ప్రతినిధి ఇంటిలో ఉన్నట్లు తెలిసింది. అక్కడ సదరు ప్రజాప్రతినిధితో తన మనసులోని ఆవేదనను వెళ్ళబోసుకున్నట్లు తెలిసింది. అనంతరం బుధవారం ఉదయం నవాబుపేట లోని వెంకటయ్య కుమారుడి ఇంటికి వెళ్తున్నా అని చెప్పి వెంకటయ్య వెళ్ళారు. కానీ సాయం త్రం వరకు కూడా అతని జాడలేకపోవడంతో అంతటా వెతికారు. అల్లారుముద్దుగా పెంచి పెద్దచేసిన వెంకటయ్య తాను చరమాంకంలోకి వచ్చేసరికి తన కన్నవారు తనను వంతుల వారిగా పంచుకుతింటారని ఊహించని ఆ తండ్రి హృదయం చలించింది. మనసును శాంతిం చుకో లేక తన చితిని తానే తాటికమ్మలను పేర్చుకుని అంటించుకుని అగ్నికి అహుతైన సంఘటన జరిగింది. ఇక అంతటా వెదకగా గురువారం సాయంత్రం పొట్లపల్లి గ్రామంలోని ఎల్లమ్మగుట్ట దగ్గర మంట ల్లో కాలిన స్థితిలో మృతదేహంను గుర్తించారు. ఈ విషయంపై ఫిర్యా దు అందిన హుస్నాబాద్ పోలీసులు ఏఎస్ఐ మణెమ్మ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించింది.

## శ్రీ వేణుగోపాలస్వామి కళ్యాణానికి పట్టు వస్త్రాలు అందజేత

**వర్గల్, మే 5 (ప్రభాతవార్త):** వర్గల్ మండలకేంద్రంలోని అతి పురాతనమైన శ్రీ వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం రాత్రి జరిగే రుక్మిణి సత్యభామ సమేత సంతాన వేణుగోపాలస్వామి కళ్యాణ మహోత్సవానికి శ్రీ విద్యాసరస్వతీ ఆలయ వ్యవస్థాపక చైర్మన్ బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి పట్టు వస్త్రాలను, ముత్యాల తలంబ్రాలను ఆలయ నిర్వాహకులకు అందజేశారు.

## 7న ఎన్‌టిఆర్ పాటలు, నృత్య పోటీలకు ఉచిత సెలెక్షన్స్

సైఫాబాద్, మే 5 ప్రభాతవార్త: విశ్వ విఖ్యాత నట సార్వభౌమ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, తెలుగువారి కీర్తి ప్రతిష్టలను ప్రపంచం నలుమూలల చాటిన డా.నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 7వ తేదీన ఎన్‌టిఆర్ పాటలు, నృత్య పోటీలకు ఉచిత సెలెక్షన్స్ నిర్వహిస్తున్నామని సర్వేజనా సుఖినో భవంతు సంస్థ తెలిపింది. ఈ మేరకు శుక్రవారం ఎస్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంస్థ స్థాపక అధ్యక్షుడు డా.ఇఎస్ఎస్ నారాయణ మాష్టారు మాట్లాడుతూ గాయని గాయకుల్లో, నృత్య కళాకారుల్లో, కవుల్లో దాగి ఉన్న ప్రతిభను ఈ పోటీల ద్వారా వెలికితీసి విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, కన్సోలేషన్ బహుమతులు, సర్టిఫికేట్లు ప్రదానం చేస్తామని చెప్పారు. 7వ తేదీ సాయంత్రం 5 గంటలకు బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్ హాల్‌లో ఈ పోటీలకు సెలెక్షన్స్ నిర్వహిస్తున్నామని, ఈ సెలెక్షన్స్‌లో అత్యంత ప్రతిభ కనబరిచిన వారికి 28వ తేదీన బాగ్‌లింగపల్లిలోని సుందరయ్య కళానిలయంలో ఫైనల్ పోటీలు నిర్వహించి ఆదే రోజున విజేతలు బహుమతులు, విన్నర్స్‌కు సర్టిఫికేట్స్ అందజేస్తామన్నారు. ఏ వయసువారైన గాయని, గాయకులు, నృత్య కళాకారులు, కవులు 7వ తేదీ మధ్యాహ్నం 2 గంటలలోపు ఉచితంగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## కారల్ మార్క్స్ పోరాట స్ఫూర్తితో కార్మికుల పక్షాన పోరాటాలు నిర్వహించాలి

### ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్



కారల్ మార్క్స్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎఐటియుసి నాయకులు

సైఫాబాద్, మే 5 ప్రభాతవార్త: ప్రముఖ మార్క్సిస్టు మేధావి, తత్వవేత్త సిద్ధాంతకర్త కారల్ మార్క్స్ 205వ జయంతి కార్యక్రమం శుక్రవారం ఎఐటియుసి కార్యాలయంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. బాల్‌రాజ్ మార్క్స్ చిత్రపటానికి పూల మాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. బాల్‌రాజ్ మాట్లాడుతూ కారల్ మార్క్స్ ప్రపంచంలో పెట్టుబడిదారి విధానంకు వ్యతిరేకంగా, కార్మికవర్గం తరపున అనేక పోరాటాలు నిర్వహించారని చెప్పారు. సోషలిజం స్థాపన కోసం ఆయన రాసిన దాస్ క్యాపిటల్ పుస్తకం నేటికి భవిష్యత్ తరాలకు మార్గదర్శకం అవుతుందన్నారు. మార్క్స్ తన జీవితాంతం కడు పేదరికాన్ని అనుభవిస్తూ తన ముగ్గురు పిల్లలకు కనీసం వైద్యం అందించలేకపోయారని, దీంతో వారు చనిపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. మార్క్స్ సేవలు మరువలేనివని, ఆయన పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకుని నేటి నాయకులు కార్మికుల పక్షాన పోరాటాలను కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహా, కార్యదర్శి బి.వెంకటేశం, నాయకులు ఎస్.ఛాయాదేవి, బోడ్డుపల్లి కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## కుమ్మరివాడలో సిసిరోడ్డు పనులకు శంకుస్థాపన

### ప్రారంభించిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



సిసిరోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు తదితరులు

హైదరాబాద్, మే 5,ప్రభాతవార్త: అంబర్‌పేట్ నియోజకవర్గం బాగ్ అంబర్‌పేట్ డివిజన్‌లోని కుమ్మరివాడలో రూ.10లక్షల నిధులతో వేయనున్న సిసిరోడ్డుపనులకు శుక్రవారం ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా అక్కడ ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చేపట్టాల్సిన ఇతర అభివృద్ధి పనుల గురించ స్థానిక నాయకులతో చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ బస్తీలో సిసిరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. సిఎం కెసిఆర్ నాయత్వంలో అంబర్‌పేట్ నియోజకవర్గంలో దశలవారీగా అన్ని రకాలసౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని ,ప్రజలకు ఎటువంటి సమస్యలు ఉన్నా వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. సిసిరోడ్డు పనులు నిర్ణీత గడువు లోగా ,నాణ్యత ప్రమాణాలల్లో ఎటువంటి లోటు లేకుండా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో అధికారులు నాయకులు, కార్యకర్తలు, బస్తీవాసులు పాల్గొన్నారు.

## రాజ్యాంగబద్ధమైన హక్కుల కోసం నిరంతరం పోరాటం



ప్రసంగిస్తున్న తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల వెంకటేశ్వర్లు

చిక్కడపల్లి, మే 5 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలో మాల, మాల అనుబంధ కులాలు రాజ్యాంగబద్ధమైన హక్కుల కోసం నిరంతరం పోరాటం చేయాలని తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో తెలంగాణ మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దమ్మ రాజశేఖర్ అధ్యక్షతన రాష్ట్ర ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన బూర్గుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దేశంలో రిజర్వేషన్‌లను ఎత్తివేసే దిశగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, అందులో భాగంగానే ప్రభుత్వరంగసంస్థల ప్రైవేటీకరణ అని, దీనిని అణగారిణ ప్రజలు, ప్రజాస్వామికవాదులంతా అడ్డుకోవాలని అన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రతి రాష్ట్రంలోని దళితులపై దాడులు జరుగుతున్నాయని, ఈ విషయంలో తెలంగాణ రాష్ట్రంలోని దళితులు, బహుజనులు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో గౌరవ అతిథిగా స్వీక్కి చైర్‌పర్సన్ డాక్టర్ సుహార్‌లత పాల్గొనగా సభలో తెలంగాణ మాలమహానాడు రాష్ట్ర, జిల్లా నాయకులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు దారాయొబూ, ఎనుపోతుల అనీల్, దమ్మ నారాయణ, కుంబాల రాజేష్, బూపెల్లి మల్లేష్, నాయిని తిరుమలేష్, బి.నర్సింగరావు, పొట్ట మధుకర్, సోగాల కృష్ణయ్య, గాజుల నాగరాజు, పిఎం.దాస్ పాల్గొన్నారు.

## 'హార్ట్‌బీట్' ('ది సౌండ్ ఆఫ్ తెలంగాణ) పుస్తకావిష్కరణ

చిక్కడపల్లి, మే 5 ప్రభాతవార్త: డివైఎఫ్ఐ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, ప్రముఖ రచయిత ఎం.విప్లవకుమార్ రచించిన 'హార్ట్‌బీట్' ('ది సౌండ్ ఆఫ్ తెలంగాణ) పుస్తకావిష్కరణ కార్యక్రమం శుక్రవారం రాత్రి బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో జరిగింది. మోదుగుపూలు ఎడిటర్ భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ సభకు ముఖ్యఅతిథిగా ప్రొఫెసర్ కంచ ఐలయ్య హాజరై ఆవిష్కరించి ప్రసంగించారు. ముఖ్యఅతిథిగా ప్రజాగాయనీ విమలక్క హాజరు కాగా ఈ కార్యక్రమంలో అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లులక్ష్మి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు జాన్‌వెస్లీ, చలకాని వెంకట్‌యాదవ్, కంబాలపల్లి కృష్ణ, కొండూరి వీరయ్య, కలుకూరి రాజు, కోయ చంద్రమోహన్, పాటల వెంకన్న, బీరెడ్డి సాంబశివ, ఆర్‌ఎల్.మూర్తి, సలీమా, బి.మహేందర్ పాల్గొన్నారు. ఈ పుస్తకాన్ని డివైఎఫ్ఐ రాష్ట్ర పూర్వ కార్యదర్శి ఎ.విజయకుమార్, ఉస్మానియా విశ్వవిద్యాలయం పరిశోధక విద్యార్థి ఇమ్మడి మహేందర్ సమీక్షించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోట రమేశ్, ఎం.వెంకటేశ్, సిపిఎం నేతలు జి.రాములు, మల్లు నాగార్జునరెడ్డి, వేముల ఎల్లయ్య, అనంతోజు మోహనకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కిషన్‌బాగ్ బిఆర్ఎస్ అధ్యక్షుడిపై ఇనుప రాడ్‌తో దాడి

చార్మినార్, మే 5 ప్రభాతవార్త : పాతబస్తీ బహదూర్‌పుర నియోజకవర్గం కిషన్‌బాగ్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు సాయి కిరణ్ పై బిఆర్ఎస్ నాయకులు ఎస్ఎ కైసర్, చాంద్ పాషాలు ఇనుప రాడ్‌తో దాడి చేసిన సంఘటన శుక్రవారం బహదూర్‌పుర పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.ఈ సంఘటనలో సాయి కిరణ్ తలకు గాయాలు అయ్యాయి. బహదూర్‌పుర పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ కథనం ప్రకారం.. ఎస్‌పి నగర్‌కు చెందిన సాయి కిరణ్ కిషన్‌బాగ్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులుగా ఉన్నారు.కాగా సాయి కిరణ్ శుక్రవారం ఉదయం 11.30 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై కిషన్‌బాగ్ నుంచి బహదూర్‌పుర వెళుతున్నాడు.ఓవైసీ మార్కెట్ వద్ద వాహనంపై వచ్చిన కిషన్‌బాగ్‌కు చెందిన సీనియర్ బిఆర్ఎస్ నాయకులు ఎస్.ఎ.కైసర్,చాంద్‌పాషాలు కలిసి ఇనుప రాడ్‌తో సాయి కిరణ్‌పై దాడి చేశారు.ఈ సంఘటనలో కిషన్‌బాగ్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు సాయి కిరణ్ తలకు దెబ్బలు తగిలాయి.కాగా అంతకు ముందు కిషన్‌బాగ్ పార్కు వద్ద వాహనాల పార్కింగ్ విషయమై సాయి కిరణ్‌కు కైసర్‌ల మధ్య వివాదం జరిగింది.సాయి కిరణ్ ఫిర్యాదు మేరకు పోలీసులు బిఆర్ఎస్ నాయకులు ఎస్ఎ కైసర్,చాంద్ పాషాలపై కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నారు.ఈకేసును బహదూర్‌పుర పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## కళాకారులు చిరస్మరణీయులు : ఆచార్య కొలకలూరి ఇనాక్

చిక్కడపల్లి, మే 5 ప్రభాతవార్త: కళాకారులకు జన్మదినం మాత్రమే ఉంటాయని, వారి కళల పట్ల చిరస్మరణీయంగా సమాజంలో నిలిచి ఉంటారని శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ వైస్‌చాన్స్‌లర్ ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. శృతిలయ ఆర్ట్స్ అకాడమి, ఆర్‌ఆర్.ఫౌండేషన్ సంయుక్త నిర్వహణలో యువకళావాహిని సాంస్కృతిక సంస్థ స్థాపకుడు వైకె.నాగేశ్వరరావు, ప్రముఖ గాయకుడు వెంకటరావుల సంస్మరణ కార్యక్రమం గురువారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో నిర్వాహక సంస్థ అధినేత్రి, గాయనీ ఆమని ఆధ్వర్యంలో జరిగింది. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఓలేటి పార్వతీశం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆచార్య కొలకలూరి ఇనాక్ ప్రసంగించారు. వైకె.నాగేశ్వరరావు సంస్థను స్థాపించి ఎందరో కళాకారులను ప్రోత్సహించారని అన్నారు. ఈ సందర్భంగా వైకె.శ్రమశక్తి పురస్కారాలను ఆనందరాజు, శ్రీనివాస్‌రెడ్డి, సతీష్‌గౌడ్‌లకు అందించగా, వెంకటరావు పురస్కారాలు సుభాష్, సీతారామయ్య, బాలకామేశ్వరరావులకు బహుకరించారు.

## కెసిఆర్ పథకాలు దేశంలోనే ఆదర్శం : టీ.ఎన్



1వ వార్డు చిన్నతోకట్టలో కల్యాణ లక్ష్మి చెక్కులను అందజేస్తున్న టీ.ఎన్.శ్రీనివాస్ తదితరులు

కంటోన్మెంట్, మే 5 ప్రభాతవార్త: రాష్ట్రంలో సిఎం కేసిఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశంలోనే ఆదర్శంగా నిలిచాయని బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టీ.ఎన్.శ్రీనివాస్ తెలిపారు. కంటోన్మెంట్ 1వ వార్డు చిన్నతోకట్టలో నివాసం ఉంటున్న రుక్మిణికి మంజూరైన కల్యాణ లక్ష్మి చెక్కును శుక్రవారం టీ.ఎన్.చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు రాజేశ్, లడ్డూ, బాలక్రిష్ణ, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

## లైన్‌మెన్‌ను ప్రశంసించిన ఎస్.ఇ

అడ్డగుట్ట, మే 5 ప్రభాతవార్త: సికింద్రాబాద్ మారేడ్‌పల్లి ట్రాన్స్‌కో సెక్షన్‌లో లైన్‌మెన్‌గా పనిచేస్తున్న లైన్‌మన్ వి.రాజరమేశ్ విధి నిర్వాహనలో సేవలను గుర్తించి ట్రాన్స్‌కో సూపరింటెండెంట్ రవికుమార్ ప్రశంసించారు. గత 5 రోజుల క్రితం కురిసిన బారీ వర్షం, ఈదురు గాలులతో చెట్లు విరిగాయి దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. విధి నిర్వాహణలో ఉన్న రాజ రమేశ్ కూలిన చెట్లను యుద్ధప్రాతిపదిన తొలగించి విద్యుత్ తీగలకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగకుండా చర్యలు చేపట్టారు. దీంతో ఎస్.ఇ, వినియోగదారులు లైన్‌మెన్‌ను ప్రశంసించారు.

## వైభవంగా లక్ష్మీ నరసింహ స్వామివారి బ్రహ్మోత్సవాలు



స్వరాజ్ నగర్‌లో లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

యూసుఫ్‌గూడ, మే 5, ప్రభాతవార్త : బోరబండ స్వరాజ్‌నగర్‌లో హరిహర క్షేత్ర దేవస్థానం శ్రీస్వయంభు శ్రీలక్ష్మీ నరసింహ స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా రెండవ రోజు శుక్రవారం అంగరంగ వైభవంగా వేడుకలు జరిగాయి. ఉదయం నుంచే స్వామి వారికి సుప్రభాత సేవ, మంగళ శాసనం యాగశాల ప్రవేశం, యాగమండపారాధన, నిత్య హోమం, బలిహరణం, శ్రీలక్ష్మీనరసింహ స్వామివారి కల్యాణం కన్నుల పండుగగా జరిగాయి. భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని దేవాలయం కమిటి ప్రధాన కార్యదర్శి కల్వల సత్యనారాయణరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం గరుడసేవ, పురవీధుల్లో స్వామి వారి ఊరేగింపు పూజ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.

## రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రాజు కుటుంబాన్ని ఆదుకుంటాం : మన్నె క్రిషాంక్



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రాజు భౌతికాయానికి నివాళులర్పిస్తున్న మన్నె క్రిషాంక్ తదితరులు

కంటోన్మెంట్,మే 5 ప్రభాతవార్త: కంటోన్మెంట్ 4వ వార్డు గాంధీ కాలనీలో నివాసం ఉంటున్న స్విగ్గీ డెలివరిబాయ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు.విషయం తెలుసుకున్న మినరల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ చైర్మన్ మన్నె క్రిషాంక్ శుక్రవారం మృతుడు రాజు కుటుంబాన్ని ఓదార్చి భౌతికాయంపై పుష్పగుచ్ఛాలు అందజేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు.


## గోషామహల్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఎస్సీసెల్ అధ్యక్షుడిగా జి.యాదగిరి




బిఆర్ఎస్ ఎస్సీసెల్ అధ్యక్షులు జి.యాదగిరికి నియామక పత్రాన్ని అందచేస్తున్న గోషామహల్ ఇన్‌చార్జ్ నందకిషోర్‌వ్యాస్‌బిలాల్

గోషామహల్,మే5ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత దళితులకు దళితబంధు అందచేసిన ఘనత ముఖ్యమంత్రి కెసిఆర్‌కే దక్కుతుందని గోషామహల్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇన్‌చార్జ్ నందకిషోర్‌వ్యాస్(బిలాల్) అన్నారు. ఈమేరకు గోషామహల్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఎస్సీ సెల్ అధ్యక్షులుగా జి.యాదగిరిని నియమించారు. ఈసందర్భంగా యాదగిరికి నియామకపత్రాన్ని అందచేశారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు అనిత,పప్పు, శైలేందర్‌కురుమ తదితరులు పాల్గొన్నారు.

## కెసిఆర్‌ను కలిసిన గడ్డం గంగాధర్ ఫౌండేషన్ చైర్మన్,బిఆర్ఎస్ నాయకులు గడ్డం శ్రీనివాస్‌యాదవ్



అఫ్జల్‌గంజ్, మే5 ప్రభాత వార్త: తెలంగాణ రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి కెసిఆర్ ఎంతో అభివృద్ధి సాధించారని గోషా మహల్ నియోజకవర్గం బిఆర్ఎస్ నాయకులు,గడ్డం గంగాధర్ ఫౌండేషన్ చైర్మన్ గడ్డం శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. మర్యాద పూర్వకంగా ముఖ్యమంత్రి కెసిఆర్‌ను కలిశారు.

## రవీంద్రభారతిలో చిన్నారుల మాతృదేవోభవ చిత్రకళాప్రదర్శన : డా. మామిడి హరికృష్ణ

రవీంద్రభారతి, మే 5 ప్రభాతవార్త : తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖ, పికాసో ద స్కూల్ ఆఫ్ ఆర్ట్ సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరం రవీంద్రనాథ్ ఠాగూర్ విగ్రహం వద్దనున్న ఫోయెర్‌లో పికాసోలో శిక్షణ పొందిన చిన్నారి విద్యార్థులు తమ కళాప్రదర్శన, ప్రతిభను చాటిచెప్పే విధంగా మాతృదేవోభవ శీర్షికన చిత్రకళా ప్రదర్శనను 3రోజులపాటు ఏర్పాటు చేస్తున్నట్లు తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. మామిడి హరికృష్ణ మీడియాకు తెలియజేశారు. అంతర్జాతీయంగా చిత్రకళా శిక్షకుడుగా వందలాదిమంది ఔత్సాహికులు, చిన్నారులు, చిత్రకారులకు అత్యాధునిక మెళకులతో అద్భుత శిక్షణ ఇవ్వడంలో పేరొందిన బైరు రమేష్ సారథ్యంలో సంస్థ విద్యార్థులు పాల్గొనున్నట్లు విశేషమన్నారు. మే 8న అంతర్జాతీయంగా మాతృదినోత్సవాన్ని జరుపుకొంటున్న వేళ మాతృదేవోభవ శీర్షికన ఈ చిత్రకళాప్రదర్శనలో విద్యార్థులంతా వారి తల్లులకు వివిధ చిత్రాల ద్వారా శుభాకాంక్షలు తెలుపుకొనే అవకాశం లభించడం హర్షదాయకమన్నారు.

ఈ ప్రదర్శన మే 8న ప్రారంభమై 10వ తేదీ వరకు ఉదయం 11 నుండి రాత్రి 7గంటలకు వరకు ఔత్సాహిక సందర్శకుల దర్శనార్థం తెరచి ఉంటుందని, ప్రదర్శన ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక, క్రీడాశాఖల మంత్రి డా. వి.శ్రీనివాస్‌గౌడ్, విశిష్ట అతిథులుగా డా. మామిడి హరికృష్ణ, బి.వందన, ఎం.వి.రమణారెడ్డి, పద్మారెడ్డి, పి.మహేష్, ఎం.శ్రీలక్ష్మి తదితరులు పాల్గొంటారని సంస్థ డైరెక్టర్, శిక్షకుడు బైరు రమేష్ తెలిపారు. ఈ చిత్రకళా ప్రదర్శనకు అధికసంఖ్యలో చిన్నారులు, విద్యార్థులు, చిత్రకళ ఔత్సాహిక ప్రేక్షకులు విచ్చేసి దర్శించి చిన్నారులను ఆశీర్వదించి ప్రోత్సహించాలని బైరు రమేష్ కోరారు.

## రహదారి వెడల్పు తగ్గింపులో భారీ కుంభకోణం

### ప్రభుత్వంపై బిజెపి నేత మల్లారెడ్డి ఆరోపణ



సమావేశంలో మాట్లాడుతున్న మల్లారెడ్డి, రాజిరెడ్డి, శ్యాంరావు

హైదరాబాద్, మే 5,ప్రభాత వార్త: కొంపల్లి, దూలపల్లి, బహదూర్‌పల్లి రోడ్డువెడల్పు తగ్గింపులో రెండువేల కోట్లకు పైగా కుంభకోణం జరిగిందని బిజెపి రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు ఎస్.మల్లారెడ్డి ఆరోపించారు. ఈమేరకు శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కుత్బుల్లాపూర్‌లో 250 అడుగుల వెడల్పు ఉన్న కొంపల్లి–దూలపల్లి–బహదూర్‌పల్లి రహదారిని 100 అడుగులకు తగ్గించారన్నారు. రోడ్డు వెడల్పు తగ్గించడం చరిత్రలోనే ఇది తొలిసారని అధి కార పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, స్థానిక మంత్రి, పురపాలక శాఖమంత్రి ప్రమేయంతోనే ఇది జరిగిందని ఆరోపించారు. జాతీయ రహదారులైన హైదరాబాద్–నర్సాపూర్, హైదరాబాద్ –నాగ్‌పూర్‌లను కలుపుతూ 6కిమీ గల కొంపల్లి –దూలపల్లి –బహదూర్‌పల్లి రహదారి హెచ్‌ఎండిఏ హుడా మాస్టర్ ప్లాన్‌లో 250 అడుగులుగా ఉంటే దాన్ని 100అడుగులకు కుదించడం సమంజసంకాదన్నారు. అయితే ఈరహదారిపై దూలపల్లి బహదూర్‌పల్లి మాత్రమే ఉన్నాయని కొంపల్లి గ్రామం దూరంగా ఉంటుందన్నారు. పారు. అయితే అధికారులు కొంపల్లి గ్రామస్తుల కోరిక మేరకు రహదారిని తగ్గించామని జీవో 96ను జారీ చేయడం శోచనీయమన్నారు. ఈరహదారిలో చాలా మంది బడాబాబుల భూములు ఉన్నాయని వాటిని కాపాడుకునేందుకే ఈనిర్ణయం తీసుకున్నట్లు ఆరోపించారు. ఈభూమివిలువ రూ.2వేలకోట్లకు పైగా ఉంటుందని ఈకుంభకోణంపై హైకోర్టులో రిట్ పిటిషన్ కూడా వేశామన్నారు. కుంభకోణంపై వెంటనే విచారణ జరిపి రహదారి వెడల్పును 250 అడుగులకు పునరుద్ధరించాలని మల్లారెడ్డి డిమాండ్ చేశారు. ఈసమావేశంలో కొంపల్లి కౌన్సిలర్ రాజిరెడ్డి, బిజెపి నాయకులు శ్యామ్‌రావు, జనార్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసేవయే పరమావధిగా పద్మక్క సేన : ప్రశాంత్




లోగో ఆవిష్కరిస్తున్న ప్రశాంత్ ఇతర ప్రతినిధులు

హైదరాబాద్,మే 5, ప్రభాతవార్త: ప్రజాసేవయో పరమావధిగా పద్మక్క సేన పని చేస్తుందని వ్యవస్థాపకులు ప్రశాంత్ తెలిపారు. ప్రముఖ వైద్యురాలుగా పలు సేవా కార్యక్రమాలు చేస్తుత ఎంతోమందిలో స్ఫూర్తిని నింపుతున్న పద్మక్క ఆశయాలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు పద్మక్క సేన ప్రారంభించామన్నారు. ఈసందర్భంగా శుక్రవారం సోమాజీ గూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంస్థలోగోను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ ఆహారం, పోషణ, మాతాశిశు సంరక్షణ, పోషకాహారంలో పాలను ఆరికట్టడం, విద్య, వైద్య యువత కేరీర్‌వంటి అంశాలపై యువతలో అవగాహన కల్పించేందుకు కృషి చేస్తామని అన్నారు. పర్యావరణం ,పేదల సంక్షేమం, వృత్తినైపుణ్యాలు పెంపు వంటి అంశాలపై శిక్షణ ఇచ్చే ఆలోచనలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో పలువురు సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

### కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన యువకులు

బేగంబజార్,మే5ప్రభాతవార్త: లోథ్ సమాజ్‌కు అర ఏకరం భూమిని ముఖ్యమంత్రి కెసిఆర్ కేటాయించిన సందర్భంగా లోథ్ క్షత్రియ యువ సమాజ్ సంఘటన్ ఉప్పర్ దూల్‌పేట్ ఆద్వర్యంలో ముఖ్యమంత్రి కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

## కూకట్‌పల్లిలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో నిర్మించనున్న ఉదాసీన్ మఠ్.. ఆధ్యాత్మిక, విద్యా కేంద్రానికి శంకుస్థాపన



రైటప్: శంకుస్థాన చేస్తున్న మహంత్ రఘు ముని

మూసాపేట, మే 5, ప్రభాతవార్త : ఉదాసీన్ మఠ్ అధ్యక్షుడు మహంత్ రఘు ముని శుక్రవారం కూకట్‌పల్లిలో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించనున్న ఉదాసీన్ మఠ్ ఆధ్యాత్మిక, విద్యా కేంద్రం భూమి పూజ చేశారు. ఉదాసీన్ మఠ్ అనేది దేశ విదేశాలలో లక్షలాది మంది అనుచరులను కలిగిన పూజ్యనీయమైన ఒక ఆధ్యాత్మిక కేంద్రం. ప్రపంచ నలుమూలల నుండి వచ్చిన భక్తులతో పాటు ఉదాసీన్ మఠ్ ఉపాధ్యక్షులు మహంత్ అరుణ్ దాస్ కూడా ఈ వేడుకకు హాజరయ్యారు. ఈ సందర్భంగా మహంత్ రఘు ముని మాట్లాడుతూ ఈ ప్రదేశం ఉదాసీన్ మఠ్‌కు ఒక తపోస్థలి వంటిది, శ్రీబాబా సజ్జన్ షా కమలాపతిజీ ఇక్కడ తపస్సు చేశారు. ప్రపంచంలో శాంతి, సామరస్యాలు వెల్లివిరియాలని, ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని కోరుతూ సర్వశక్తిమంతుడైన ఆ పరమాత్ముడి ఆశీర్వాదం కోసం మేము గత మూడు రోజులుగా ఇక్కడ భూమి పూజ, పవిత్ర హవనం చేసాము. యువతకు ఆధునిక విద్యతోపాటు మన పవిత్ర గ్రంథాలపై అవగాహన కల్పించేందుకు వేద విశ్వ విద్యాలయాన్ని ఏర్పాటు చేస్తాం. మనం ఎంతో పవిత్రంగా భావించే గోవుల సంరక్షణ కోసం ఇక్కడ గోశాలను ఏర్పాటు చేయనున్నాము. హైదరాబాద్‌ను సందర్శించే సాధువులు, సత్పురుషుల కోసం సంత్ నివాస్ నిర్మించబడుతుంది. అన్నదాన సేవతో ఇక్కడ అనాథలకు ఆశ్రయం కూడా ఏర్పాటు చేస్తారు. శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ ఉదాసీన్ మఠ్ ఎంతో గొప్ప సేవ చేస్తున్నదని, హైదరాబాద్‌లో వేద పాఠశాల, గోశాల, ఆసుపత్రి, అనాథాశ్రమం వంటి ఇతర సౌకర్యాలతో సహా అనేక ప్రజా ప్రయోజన సౌకర్యాలను ఏర్పాటు చేస్తుంది. మఠం అందించే సేవలకు మా ప్రభుత్వం తరపున అన్ని సహాయ సహకారాలను అందిస్తామన్నారు. నూతనంగా అభివృద్ధి చేస్తున్న ఈ కేంద్రంలో శాంతి నివాస్, వేద పాఠశాల, యాగశాల, గోశాలతో సహా అనేక ప్రజలకు ఎంతో ఉపయోగపడే కేంద్రాలు ఏర్పాటవుతున్నాయన్నారు. తదుపరి దశలలో అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన విద్యా సంస్థ, ఆసుపత్రి, వృత్తి, విద్యా కోర్సుల కేంద్రాలు కూడా ఇక్కడ ఏర్పాటు కానున్నాయన్నారు.

## ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన టీఆర్ఎస్ శ్రేణులు

### భారీ గజమాల, షాలువాలతో ఘన సన్మానాలు



రాజేంద్రనగర్ శాసన సభ్యులు టీ.ప్రకాశ్‌గౌడ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్

నార్సింగి, మే 5 ప్రభాతవార్త : రాజేంద్రనగర్ నియోజకవర్గం హాట్రిక్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్‌కు వందలాది మంది టీఆర్ఎస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం ఎమ్మెల్యే ఇంటి వద్ద అభిమానుల జాతర కొనసాగింది. నాయకులు, అభిమానులంతా భారీ గజమాలలు వేసి, షాలువాలు, పూలదండలు వేసి, భారీ కేక్‌లు కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ తన వద్దకు వచ్చిన ప్రతీ ఒక్కరిని చిరునవ్వుతో పలుకరించారు. శుభాకాంక్షలు తెలిపిన నాయకులు, అభిమానులు తమ అభిమాన నాయకుడైన ప్రకాశ్‌గౌడ్‌తో ఫొటోలు దిగేందుకు ఎగబడ్డారు. ప్రకాశ్‌గౌడ్ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి వరుసగా మూడుసార్లు శాసనసభ్యులుగా ఎంపికై హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా పేరు తెచ్చుకున్నారు. సౌమ్యుడిగా ఉంటూ, తన వద్దకు వచ్చిన ప్రతీ ఒక్కరి సమస్యలు అడిగి తెలుసుకొని వెనువెంటనే పరిష్కరిస్తున్నారు. ఈ కారణంగానే నియోజకవర్గంలోని ప్రజలంతా పార్టీలకు అతీతంగా ప్రకాశ్‌గౌడ్‌ను అభిమానిస్తున్నారు. బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్, డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి, పార్టీ అధ్యక్షులు గోకరి సురేష్‌గౌడ్, సహకార సంఘం చైర్మన్ బొర్ర రాందాస్ ముదిరాజ్, కార్పోరేటర్లు తలారి చంద్రశేఖర్, సాగర్‌గౌడ్, సీనియర్ నేతలు నవాబ్ ముంతాజ్, నాగరాజు, పాపయ్య యాదవ్, పాండు, సుమన్‌గౌడ్ తదితరులు ప్రకాశ్‌గౌడ్‌ను కలిసి సన్మానించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

నార్సింగి : మాజీ ఎంపిపి తలారి మల్లేష్ ముదిరాజ్, గండిపేట్ మండల అధ్యక్షులు రామేశ్వరం నర్సిహ్మా, నార్సింగి మున్సిపల్ చైర్ పర్సన్ రేఖ యాదగిరి, వైస్ ఛైర్మన్ వెంకటేష్ యాదవ్, కౌన్సిలర్లు గంగిడి శివారెడ్డి, పత్తి శ్రీకాంత్ అలాగే మణికొండ మున్సిపాలిటీ నుంచి ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి, పార్టీ అధ్యక్షులు బి.శ్రీరాములు తదితరులు ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు పుష్పగుచ్ఛాలిచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## నార్సింగిలో 400 అడుగుల ఎత్తైన హరేకృష్ణ హెరిటేజ్ టవర్ నిర్మాణం

### హరేకృష్ణ మూవ్‌మెంట్ చైర్మన్ మధు పండిత దాస




నార్సింగిలోని గోష్పాద క్షేత్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న హరేకృష్ణ మూవ్‌మెంట్ చైర్మన్ మధు పండిత దాస

నార్సింగి, మే 5 ప్రభాతవార్త : రాజధాని హైదరాబాద్ మహా నగర శివారు నార్సింగిలో 400అడుగుల ఎత్తైన హరేకృష్ణ హెరిటేజ్ టవర్‌ను నిర్మిస్తున్నామని హరేకృష్ణ మూవ్‌మెంట్ చైర్మన్ మధు పండిత దాస పేర్కొన్నారు. శుక్రవారం కోకాపేట్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారతీయ సనాతన సంస్కృతీ, సాంప్రదాయాలను, వారసత్వంను భావి తరాలకు అందించేందుకు హరేకృష్ణ మూవ్‌మెంట్ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. 6.ఎకరాల విస్తీర్ణంలో రూ.200కోట్ల నిధులతో నిర్మితమవుతున్న ఈ టవర్‌కు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ నెల 8.వ,తేదీన ఉదయం 11.గంటలకు భూమిపూజ చేయనున్నారని వివరించారు. బృందావనంను తలపించేలా రాధాకృష్ణులతో పాటు అష్ట సఖుల దేవాలయాలు, తిరుపతి వేంకటేశ్వర స్వామి పుణ్యక్షేత్ర దివ్యత్వాన్ని తలపించే విధంగా శ్రీనివాస గోవిందుడి ఆలయాలు ఇక్కడ నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ ఆలయాల నిర్మాణంలో కాకతీయ, చాళక్య, ద్రవిడ ఇతర పురాతన నిర్మాణ శైలిలను అనుసరిస్తున్నామన్నారు. గ్రంథాలయం, మ్యూజియం, మల్టీ విజన్ థియేటర్, పిల్లలు, యువత, పెద్దలకు ఆధ్మాత్మి, సాంస్కృతిక విద్యను అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ టవర్‌లో నిత్యాన్నదానం కూడా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సీఎం కేసీఆర్ యాదగిరిగుట్ట దివ్యక్షేత్రంను నిర్మించిన తీరుగానే హరేకృష్ణ హెరిటేజ్ టవర్ కూడా పూర్తయ్యేలా సహకరిస్తానని మాటివ్వడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ హైదరాబాద్ అధ్యక్షులు సత్యగౌరవ చంద్రదాస, సత్యగౌర చంద్రదాస తదితరులు పాల్గొన్నారు.

